# మాయా బజారు

బలివాడ కాంతారావు



ఒక సాయంత్రం ఒక గ్రామం లో ఒక మూలకు ప్రత్యేకంగా వున్న ఇంటి వరండాలో కనిపించే వారిలో ప్రధానమైన వాళ్ళిద్దరు. ఒక మగాడు. ఒక ఆడది. మగాడు మంచంమీదనించి లేవలేక కూర్చు న్నాడు. ఆడది అతనికన్నా వయసులో పదేళ్ళు చిన్న. పచ్చని సైకం లేకపోయినా పండుకాయలా వుంది. ఒక్కసారి మగాడి వీపు చరచి "చెప్పు" అని అరచింది ఆ భక్తురాలు.

"అమ్మో! నా వీపు చరిచేస్తున్నావే" మూలిగాడు మగాడు.

"దేనిమీద యెచ్చు మమకారమో నీ నోట సెప్పంది, నా దేముడికి నీమీద కని కరం రాదంది" ఆడది.

"మమకారమా? దేనిమీద లేదని సెప్తాను?" అని మూలిగాడు మళ్ళీ అతడు.

ఆ శివభక్తురాలు ఈసారి అతని తల పట్టుకుని "ఒత్తు జుత్తంతా వూడిపోయినా యింకా నీకు మమకారం సావలేదు. ఏటి వదులుతావో సెప్పు"

"చెప్పు నాన్నా! ఈ వేళనించీ సిగరెట్లు తాగనని చెప్పు" అంత దూరంనించే అరి చాడు చిన్నకొడుకు.

"అమ్మో! సిగరెట్ మానడమే "

"పోనీ ఆ రాకాసి తిండి తగ్గిస్తాననండి" అంది భార్య సేవ చేసిచేసిచిక్కి శల్యమైంది.

"నన్నేం చెయ్యమంటావే? ఆకలి... ఆకలి."

"పోనీ మందు అంటే స్పిరిట్ మానండి" అన్నాడు చిన్నకొడుకు వేళాకోళంగా నత్తిగా మాట్లాడుతూ.

అలవాటు చేసుకున్నవన్నీ హాయినిస్తుంటే వదిలేమంటావా?"

"ఆ మెడలోని బంగారం గొలుసెం దుకు? నా కిచ్చేయండి" అని దగ్గరగా పెద్ద కొడుకు వస్తే—

"దీన్నా-చూడ్రా-గొలుసుకిఆంజనేయుల వారి బిల్ల వుంది. దీన్ని వదలనంటే వద లను" అన్నాడు.

"ఏదీ వదలకపోతే నా శివుడు పేరు సెప్పి చేసిన పాపాలైనా సెప్పవా?" అని అరచింది భక్తురాలు.

"ఓసే చిలకమ్మా! అనుకుంటే అన్నీ పాపాలేనే-అనుకోకపోతే అన్నీ పుణ్యాలే భక్తురాలైపోయి నీ పాపాలమీద తెర లాగే సావే" అన్నాడు మగాడు.

భక్తురాలికి కోపం వచ్చి "ఏ డాక్టరూ నీ రోగం నిదానం సెయ్యలేకపోబట్టి కదా నా దేముడి-కనికరానికి నన్నిక్కడికి లాక్కొచ్చినావు-నాను సెప్పినట్లు ఇంటావా లేదా?" అంటూ ఒక్క చరుపు వీపుమీద చరవగానే "అమ్మో సంపేసావే" అని అతడు కూలబడిపోయాడు. దానితో భక్తు రాలు భగ్గుమని మండిపోతూ శివాలేసింది.

అందరికీ తెలుసు అతగాడు బ్రతికే అవకాశంలేదని. మంచంమీదే అన్ని పనులు. మోగం వాచిందిగానీ ఇంకా మాటధాటి తగ్గలేదు. కాళ్ళు పట్లు పట్టి కదలకపోయినా ఇంకా పొంగి వాచిపోలేదు అందుకే ఆ చావు ఎప్పుడు వస్తుందో చెప్ప లేకపోతున్నారు. ఈలోగా అతను గడించిన దానిలో జల్సాగా ఖర్చుపెట్టగా మిగిల్చింది హారతి కర్పూరంలా వెలిగి చేస్తున్నాడు. మంచం దిగలేకపోవడంవలన అతనో డిస్మిస్ చేసిన మంత్రివర్యునిలా ఉన్నాడు. కానీ ఇంకా మంత్రిగా వెలిగిస్తున్నట్లే మెసలు తున్నాడు.

ఇతని గురించి చెప్పక్కర్లేకండానే అంతా తెలుసుకునే వుంటారు. కానీ ఆమె గురించి తెలుసుకోవటం అవసరం. ఆడది ఎగిరితే, పావురమని కవిత్వం చెప్తారు. దొరికితే దొంగ సొమ్ములా పంచుకుంటారు. పరువు, నిలుపుకుంటే, కరువు సృష్టించి కనుసైగ చేస్తారు. ఆవిడ పెదాలు తేనె పట్టు. ఆ వయ్యారం జారిపోగానే అది మైనం ముద్ద. ఈ చిలక మనసు అమ్మ

తమై, బతుకుతామనుకున్న రోజల్లో, పాం
పొంగులా పైకెగస్తున్నప్పుడు, పంక పలు
కులు కొలికై ఎగురుతున్నప్పుడే ఆమెను
అందల మెక్కిస్తానని, ఆశలుపెట్టి అయిన
వాళ్ళకు దూరంచేసి తెచ్చాకొకడు అవస
రాలు తీరేక నడివీధిలో వదిలేసి పోయాడు.
ఇప్పుడు బతికిందే బతుకనుకుంది. గీతబాగు
లేకపోయినా కోతిముందను అనుకుని,
వలపుచింతవున్న వాళ్ళకు ఆశ్రయమిచ్చింది
కాంచనం కర్మవిమోచనం అన్నారుకదా
పెద్దలు. సిగ్గువదులుకున్నా సిరివదించలేదు.
కానీ చిన్నెలు వన్నెలు పెరిగి సుఖం మరిగి
పోయింది వెచ్చగా వుండే పీకల్లోతింటూ
పచ్చగా వుండే బేరమాడే యీ మొగజాతినే
చులకనగా చూస్తున్న సమయంలో, చుట్టూ
చేరిన వందకాకుల్లాంటి మగాళ్ళమీద ఒక్క
రాయి విసిరి శివభక్తురాలై కూర్చుంది.

అలాంటోడు యిలాగే మారత రని కొం
పరు వ్యాఖ్యానించారు. గానీ అసలు సంగతి
యెవరికీ సరిగ్గాతెలియదు ఇప్పుడు మగాళ్ళ
వెకిలి నవ్వులను వెటకారం చేస్తు తిరస్క
రిస్తోంది. ఇదివరకు మగాళ్ళ గోళ్ళతో గిల్లిం
చుకున్నది. యిప్పుడు పౌరపాల మాట
ఆడినవారిని రక్కడానికి వాటి గోళ్ళను
పెంచుకున్నది. పట్టుదలతో పళ్ళు, ఒళ్ళు
తెల్లబడ్డాయి. ముఖంలో ధగధగ మండే
కుంకుమ బొట్టు కళ్ళల్లో కొత్త వెలుగును
ప్రసాదించింది.

మరుచటిరోజు చీకటిపడే సమయానికి
చిలకమ్మ వచ్చేసరికి శోభనాద్రి ఒక్కడే
మంచం మీద కూర్చున్నాడు. చిలకమ్మను
చూడగానే శోభనాద్రి భార్య సూరమ్మ
"మాయాబజారుకెళ్ళవా?" అన్నది.
"బయస్కోపులాటి మన బతుకే ఒక
మాయాబజారు" అని వ్యాఖ్యానించింది.
"అందరూ యెలిపోయారు. ఎవ్వీక్క
డుంటానంటే నేనెల్లి వస్తాను"
అంటూ నడివీధిలో చిన్నతెరపై వేస్తున్న
సినిమా చూడానికి వెళిపోయింది. ఆ వీధి
వీధంతా ఖాళీ. మంచం మీద శోభనాద్రి.
యెదురుగా చిలకమ్మ. అలా కళ్ళప్పచెప్పి
చూస్తూ.
"ఆనాడు నాకంటిలో పడకండా యెలా
తప్పించుకున్నావే" అన్నాడు శోభనాద్రి.
ఊహించని ప్రశ్న రాగానే "ఆ రోజులు
ఈసెత్తుతావు" అంది.
"అనుకోడానికి..."
"అప్పుడు పెద్దింటి రంకులేలుతున్నోడివి
బజారు ముండను-నీ కంటికి ఆనతానా?"
"ఆనాడు ఆనలేదుగానీ-ఈ నాడు ఆన
తన్నావే."
"వీపు చరుస్తాను-జాగర్త!"
"నా మాటవినే... చచ్చేముందు ఒక
కోరికవున్నాదే!"
"సెప్పక్కర్నేదుగానీ ... ముడుకులు
పడిపోయినా యెందుకో ఈ కావరం?
ముందుగతి ఆలోసించుకో!"
"ఇప్పుడు గతి ఆలోచించు!"
"నీ బతుకెక్కడో తిరకాసయినాది-ఆ
తిరకాసు తెలుసుకో."
"నీబతుకులో తిరకాసులేనట్టు మాటాడు
తున్నావు. ఊరకనే అడగలేదే-కాదనకు.
నివ్వు జారుముడివి. ఇంకా చెక్కు చెదర
కుండా వున్నావు, నీకూ కోరికలుంటాయి.
నా దగ్గిర మిగిలింది యిది. ఈ గొలుసు
తీసుకో..."
"నన్ను దొంగను సెయ్యడానికా?"
"ఎవరితోనూ నీకిచ్చినానని చెప్పను.
ఈక్షణంలో ఈ భక్తురాలి వేషం తీసి రా"
అంటూ చిలకమ్మను ముట్టుకోబోతే కాస్త
తప్పుకుంది.
"నిన్ను బతిమాలుతున్నానే...అలవాటు
తప్పించుకోలేను."
ఒక్కసారి చిలకమ్మ అతని వీపుమీది
చరిచి "తెలివి తెచ్చుకో...." అనగానే
"అమ్మో!" అంటూ "పతివ్రత అయి
పోనావే."
"అవును అయిపోయినాను."
"శివభక్తురాలు...దేముడి పెళ్ళం అయి
పోనాది. బజారు ముండ" అక్కసుతో
విసవిసలాడుతూ అన్నాడు.
"దేముడి పెళ్ళం యెందుకవ్వాలి?
మనిషి పెళ్ళాన్నే అయ్యాను."
"ఎవడే ఆ మొగుడు?"
"ఏదో ఒకటి ఒదులుకోలేని వాడివి నే
నెల సెప్పాలి?"
"అదేదో వినడానికి దేన్ని వదలమం
టావే సెప్పే?"
"నీ యిష్టం"
"ఇదిగో సిగిరెట్ పెట్టి-పారేస్తున్నాను"
అంటూ విసిరేసాడు శోభనాద్రి.
"ఇప్పుడు సెప్పు నీ మొగుడెవడో?"
"ఇక్కడ లేడు"
పుస్తెకట్టి యెటు వెళ్ళాడు?"
"పుస్తె కట్టలేదు. ఎందరు
మగాళ్ళు నన్ను ముట్టుకున్నా వాళ్ళమీద
యిశ్వాసం-భక్తి లేదు-అందుచేత అలెవరూ
నా మొగుళ్ళుకారు"
"ఇంకెవరే?"
"ఆ బాబు నన్ను ముట్టకోలేదు. కానీ
ఆయనమీద నాకుయిస్వాసం-భక్తి-అందుకే
ఆ బాబే నా మొగుడు"
"ఏ బాబే..."
కోయిల దగ్గరకు ఐదు పంటల కిందట
ఒక వయసులో వున్న సాధురాలేదా?"
"వచ్చాడు"
"అప్పుడు అందరినీ లొంగదిసుకున్నట్టు
ఆబాబునీ లొంగదీసుకుంటానని అర్ధరాత్రి
మీద ఆయనపాకలో దూరాను లొంగదీసు
కోడానికి యెన్ని పనులు సెయ్యాలో అన్ని
పనులూ సేసాను. ఒక్కలేదు. పట్టుదల
వచ్చేసింది. మరో రాత్రి యెల్లాను. ఇలా
మూడు రాత్రులు అన్నీ విప్పుకున్న ఆడ
దాన్నిచూసి చెలించలేదా మొగాడు. నాలుగో
రాత్రి అతని పాదాల మీద పూలదండ పెట్టి
పడ్డాను. అప్పుడు నీకు దేనిమీద హెచ్చు
మమకారమో దాన్ని వదిలీగలవా? అని
అడిగాడు. తటపటాయిస్తుంటే ఆమమకారం
వదిలేసుకుంటే, నీ మీద నీకు యిస్వాసం
కలుగుతాది అన్నాడు. మనిషిలో దేముడ్ని
సూసాను. అందుకే ఆ మనిషికి పూలదండ
ఏసేసాను. పెతిసెణం తల్చుకోడానికి నా
బతుకులో అదొక్క ఘటన సాలు. ఆనాటి
నుంచీ భక్తురాలనయిపోనాను. నేనిప్పుడు
నిప్పుతో సమానం నన్ను ముట్టక...."
చిలకమ్మ లేచి నిల్చుంది. ఒక్క
మోజు వదలిపెట్టి జీవితంలో ఒక హుందాని
తెచ్చి పెట్టుకుంది. ఎవరగా మమకారాల
సంకటాలు తగిలించుకున్న మగాడు నోరు
చప్పరిస్తున్నాడు అతని వీపుమీద ఒక్క
చరుపు చరిచింది.
"అమ్మో!" అన్నాడు.
"మాయా బజారులో సిక్కుకున్నావు.
ఒక మమకారం వదిలినా బయటపడేవోడివి.
ఏం బతుకు నీది శివ-శివా" అంటూ అతని
వీపు చరచి కదలిపోయింది.